# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 26-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.
- ❖ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.
- ❖ మహాకుంభమేళా పుణ్య స్నానాలు ఈ రోజుతో ముగియనున్నాయి.
- ❖ భారత్ ఆఫ్రికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 10 వేల కోట్ల డాలర్లకు చేరుకుందని కేంద్రమంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు.

=====================

మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు దేశ ప్రజలకు సామాజిక మాధ్యమ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. మహాదేవుని ఆశీర్వాదం పౌరులందరికీ ఉండాలని, భారతదేశం పురోగతి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించారు.

అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు దేశ పౌరులకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ... శివునికి అంకితం చేయబడిన ఈ దివ్యమైన రోజున ప్రజలకు ఆనందం, శ్రేయస్సు, మంచి ఆరోగ్యాన్ని తీసుకురావాలని ప్రార్థించారు.

=====================

సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. ఈరోజు అరుణాచల్ ప్రదేశ్ బోసిమ్లాలో జరిగిన మొట్టమొదటి ఉమ్మడి మెగా న్యోకుమ్ ఏలో వేడుకకు ఆయన హాజరయ్యారు. ఆర్థికవృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సాంఘిక సంక్షేమ పథకాలలో దేశం సాధిస్తున్న అద్భుతమైన పురోగతిని ఆయన ప్రశంసించారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశమని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ ..

(వాయిస్ 38 సెకన్లు)

అలాగే ఈ కార్యక్రమానికి హాజరైన పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 42 వేల కోట్ల రూపాయలతో ఫ్రాంటియర్ హైవే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లండించారు.

=====================

ఉత్తరప్రదేశ్ - ప్రయాగ్‌రాజ్‌లో అత్యంత వైభవంగా జనవరి 13న మొదలైన మహాకుంభమేళా పుణ్య స్నానాలు ఈ రోజుతో ముగుస్తున్నాయి. మహా శివరాత్రి పర్వదినం కూడా కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. త్రివేణీ సంగమం ఘాట్లు భక్తులతో నిండిపోయాయి. మహాశివరాత్రి సందర్భంగా నాగ సాధువులు కాశీ విశ్వనాథ ఆలయం వైపు వెళ్లి శివుడికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇప్పటివరకు 65 కోట్లకు పైగా భక్తులు వచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. చివరి అమృత్ స్నానం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని, దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఏర్పాట్లను గోరఖ్‌నాథ్ కంట్రోల్ రూమ్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షిస్తున్నారు.

భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోకుండా ఉండేందుకు కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. కుంభమేళా ముగిశాక భక్తులు క్షేమంగా తిరుగు పయనం అయ్యేలా ప్రయాగ్‌రాజ్ నుంచి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు ఈ రోజు 350 రైళ్లను నడపనున్నట్లు రైల్వేశాఖ తెలిపింది.

=====================

మహాశివరాత్రి వేడుకలను దేశ వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరుపుకుంటున్నారు. గుజరాత్‌లో సోమనాథ్ మహాదేవ్ ఆలయం, ద్వారకలోని నాగేశ్వరాలయం, రాష్ట్రంలోని ఇతర ప్రముఖ శివాలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలోని కాశీ విశ్వనాథ్ ధామ్‌తో సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శివాలయాలకు ఉదయం నుండి భక్తులు శివుని జలాభిషేకం చేయడానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మహాశివరాత్రికి కాశీలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జార్ఖండ్‌లోని పన్నెండు జ్యోతిర్లింగాలలో ఒకటైన బాబా బైద్యనాథ్‌ధామ్ దేవఘర్‌లో శివుని ఊరేగింపు వైభవనగా జరిపారు. మహాశివరాత్రి ఉత్సవాలను ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈరోజు డియోఘర్‌లోని కెకెఎన్ స్టేడియంలో ప్రారంభించారు.

=====================

ఆకాశవాణి - కుంభవాణి ఛానెల్ మహాకుంభ వార్తలను అందించడంలో చేసిన కృషిని ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది ప్రశంసించారు. ఈ రోజు ఆయన తన సందేశాన్ని అందిస్తూ.... కుంభవాణి ద్వారా ఎప్పటికప్పుడు తాజా వార్తలు, ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలను అందించడం ద్వారా ఆకాశవాణి ప్రభుత్వ రంగా ప్రసార సంస్థగా తన పాత్రను నెరవేర్చిందని పేర్కొన్నారు. మహాకుంభ్, కుంభవాణి రెండూ ప్రజల జీవితాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపాయని ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రజ్ఞా పలివాల్ గౌర్ తన సందేశంలో పేర్కొన్నారు. తక్కువ వ్యవధిలో ఎక్కువ మంది ప్రేక్షకులను చేరుకోవడంలో కుంభవాణి ఛానెల్ విజయాన్ని సాధించిందని తెలియజేశారు.

విరామం

=====================

ఆఫ్రికాలో భారత్ నాల్గవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, ద్వైపాక్షిక వాణిజ్యం దాదాపు 10 వేల కోట్ల డాలర్లకు చేరుకుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. జపాన్-ఇండియా-ఆఫ్రికా బిజినెస్ ఫోరమ్‌లో ఈ రోజు ఆయన దృశ్య మాధ్యమ విధానంలో మాట్లాడుతూ... ఆఫ్రికన్ దేశాలను అభివృద్ధి చెందుతున్న రంగాలలో

బలోపేతం చేయడానికి భారత్, జపాన్ సహకరించగలవని తెలిపారు. ఆఫ్రికా పట్ల భారతదేశపు విధానం, నిబద్ధతతో ఎల్లప్పుడూ మార్గనిర్దేశం చేయబడిందని జైశంకర్ పేర్కొంటూ..

(వాయిస్ 38 సెకన్లు)

====================

నార్త్ ఈస్టర్న్ కౌన్సిల్ (NEC) అభివృద్ధి కార్యక్రమాల్లో ఆలస్యమైన 10 ప్రాజెక్టులను వేగవంతం చేయాలని మేఘాలయ ప్రభుత్వాన్ని ఉత్తర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ ఈరోజు కోరారు. రాష్ట్రంలో ఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వివిధ ప్రాజెక్టులను కేంద్ర సహాయ మంత్రి ఈరోజు సమీక్షించారు. మేఘాలయ తన విజన్ డాక్యుమెంట్ 2047ను మార్చిలో విడుదల చేస్తుందని, త్వరలో ఈశాన్య రాష్ట్రాలు దేశానికి శక్తి కేంద్రంగా మారనున్నాయని ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యాటక రంగంలో మేఘాలయకున్న అవకాశాలను, సమర్థతను ఆయన ప్రశంసించారు.

====================

తెలంగాణా రాష్ట్రంలో శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్బిసి) సొరంగం ప్రాజెక్టులో చిక్కుకున్న 8 మందిని రక్షించేందుకు ప్రత్యేక రక్షణ బృందాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. కాగా తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ రోజు టన్నెల్ వర్క్స్ నిపుణులతో మరోసారి పరిస్థితిని సమీక్షించారు. సొరంగం పనుల్లో నిపుణులైన బృందాలు సరిహద్దు భద్రతా దళం నుండి ఘటనా స్తలానికి చేరాయి. కల్నల్ కమ్మరి మెప్రో, లెఫ్ట్ కల్నల్ హర్పాల్, NDRF DIG షాహదీ, నేవీ అధికారి VK ప్రసాద్, ర్యాట్ మైనర్స్ బృందానికి చెందిన ఫిరోజ్ ఖురేషి సహా భారత ఆర్మీ అధికారులు చిక్కుకున్న వారి వద్దకు చేరుకోసే వ్యూహాలపై చర్చించారు.

====================

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీర్ సావర్కర్ వర్ధంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఆయనకు సామాజిక మాధ్యమ వేదికగా నివాళి అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో త్యాగం, ధైర్యం, పోరాటంతో నిండిన వీర్ సావర్కర్ అమూల్యమైన సహకారాన్ని దేశం ఎప్పటికీ మరచిపోదని తన సందేశంలో ప్రధానమంత్రి పేర్కొన్నారు.

====================

భారత సైన్యం 80 కోట్ల రూపాయలకు పైగా 223 ఆటోమేటిక్ కెమికల్ ఏజెంట్ డిటెక్షన్, అలారం (ACADA) వ్యవస్థల సేకరణకు ఎల్ అండ్ టి లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఫీల్డ్ యూనిట్లలో ACADA వ్యవస్త చేరికతో భారతీయ సైన్యం డిఫెన్సివ్ కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్ న్యూక్లియర్ కార్యకలాపాలకు, ప్రత్యేకించి పారిశ్రామిక ప్రమాదాలకు సంబంధించిన విపత్తు సహాయ పరిస్థితులకు ప్రతిస్పందించే సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని ఆ శాఖ పేర్కొంది.

====================

భారత చెస్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపీ మొనాకో ఉమెన్స్ గ్రాండ్ ఛాంపియన్షిప్ లో ఉత్కంఠ భరితంగా సాగిన 7వ రౌండ్‌లో స్పెయిన్‌కు చెందిన సరసాదత్ ఖడెమ్‌పై కీలక విజయం సాధించింది. ఈ విజయంతో ఆమె మొత్తం 4 పాయింట్లు సాధించి స్టాండింగ్స్‌లో సంయుక్తంగా 2వ స్థానానికి చేరింది.

====================

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా లాహోర్ వేదికగా ఈ రోజు జరుగుతున్న ఆఫ్ఘనిస్థాన్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ లో  మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ 325 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ కు నిర్దేశించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ కపటి వార్తలు అందే సరికి 22 ఓవర్లకు 3 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది.

=====================
=====================